

నిష్పక్షపాతమైన వార్తల నిలయం
22ND ANNIVERSARY
వసంతాల ఆక్షరోద్యమం 2004-2026
నేటిధాత్రి®
తెలుగు వార్తా పత్రిక



మంగళవారం 30-06-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 83 రూ॥ 6.00

# కూర్పు లేదు.. మార్పు లేదు!?

## క్యాబినెట్ విస్తరణ అనే ముచ్చటే లేదు!

## పునర్ వ్యవస్థీకరణ అనే ఆలోచన లేదు




- ఆశావహుల ఆశ మాత్రం ఆగడం లేదు.
- ఢిల్లీ పెద్దల ప్రసన్నం కోసం ప్రదక్షిణలు ఆపడం లేదు.
- ఇప్పటికే సీఎం ఈ విషయాన్ని అనేక సార్లు చెప్పారు.
- అయినా ఆశావహులు ఆగడం లేదు. ఢిల్లీ వైపు చూడకుండా ఉండడం లేదు.




- ఆరు నెలలకోసారి మంత్రి వర్గ విస్తరణ వార్తలు రావడం!
- ఆశావహులు, నాకంటే, నాకు అని ప్రకటనలు చేయడం షరా మాములుగా మారింది.
- కొన్ని రోజులకు ఆశావహుల ఆశల మీద సీఎం నీళ్లు చల్లడం కూడా పరిపాటి అయ్యింది.
- కేరళ ఎన్నికల తర్వాత విస్తరణ ఉంటుందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది.
- ఆ ప్రచారం అంతా ఒట్టిదే అని తేలింది.
- మంత్రి వర్గం సంపూర్ణంగా వుందని సీఎం రేవంత్ రెడ్డి తొలి రోజు నుంచి చెబుతున్నారు.
- అదే నిజమౌతూ వస్తోంది... సీఎం రేవంత్ ఆలోచనల మేరకే జరుగుతుంది.
- ఇక ఇప్పట్లో తేనె తుట్టెను కదపాలని సీఎం రేవంత్ రెడ్డి అనుకోవడం లేదు.
- సాఫీగా సాగుతున్న ప్రభుత్వంలో అలజడి రేగాలనుకోవడం లేదు.
- విస్తరణ చేపడితే అనేక సమస్యలు ఉత్పన్నామౌతాయి.
- మార్పులు, చేర్పులు చేసినా ఇబ్బందులు ఎదురైతాయి.
- ఎన్నికలకు ముందు గందరగోళం అవసరం లేదనుకుంటున్నారు.
- జిహెచ్ఎంసి ఎన్నికలు, పరిషత్ ఎన్నికల ముందు తలనొప్పులు వద్దని సీఎం అనుకుంటున్నట్లున్నాడు.
- ఇప్పుడున్న క్యాబినెట్ చాలనుకుంటున్నాడు.
- అందుకే ఎవరూ ఆశలు పెంచుకోకుండా విస్తరణ ఉండదని మరో సారి తేల్చి చెప్పారు.

హైదరాబాద్, నేటిధాత్రి:
మీడియాకు వార్తలు లేనప్పుడు కొత్త కొత్త వార్తలు సృష్టిస్తుంటారు. గతంలో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలుసుకొని వార్తలు రాసేవారు. కాని ఇప్పుడు వార్తల సృష్టే అసలైన జర్నలిజమైపోయింది. అది పెద్ద పెద్ద చానళ్లుగాని, పత్రికలు గాని, ఆఖరుకు సోషల్ మీడియా అయినా సరే కొత్త వార్తలు కొత్తగా లేకపోతే, జనం చూడడం లేదు. చదవడం లేదు. అందుకే ఏదో ఒక కొత్త వార్త సృష్టించడం అలవాటు చేసుకున్నారు. అదే సమయంలో పాలకులు కూడా టాపిక్‌లను డైవర్ట్ చేయడానికి కూడా మీడియాను బాగానే వాడుకుంటారు. ప్రతిపక్షాల వార్తలు హైలెట్ కావొద్దనుకున్న ప్రతిసారి ఏదో ఒక వివాదం పాలక పక్షం కూడా చూపిస్తుంది. అది ఆ పార్టీ, ఈ పార్టీ అని తేడా లేదు. ఎవరు పాలకులుగా వున్నా ఇదే జరుగుతోంది. అందులో మంత్రి వర్గ విస్తరణ అనేది అప్పుడప్పుడు పాలపొంగులా వార్తలు వస్తుంటాయి. పోతుంటాయి. కాని విస్తరణ అనేది కనిపించదు. మీడియాకు మాత్రం వార్తలౌతాయి. ఆశావహుల్లో ఆశలు రేపుతుంటాయి. అంతలోనే ఆశల మీద నీళ్లు జల్లే వార్తలు వస్తుంటాయి. మొన్నటి అదితో విస్తరణ. ఇదతో విస్తరణ అని పెద్దఎత్తున ప్రచారం జరిగింది. కేరళ ఎన్నికలు ముగిసిన వెంటనే తెలంగాణలో మంత్రి వర్గ విస్తరణ వుంటుందని వార్తలు పుంకానుపుంఖాలుగా వచ్చాయి. కాని ఏమైంది..సిఎం. రేవంత్ రెడ్డి ఒక్క మీడియాతో జరిగిన చిట్ చాట్‌లో ఒక్క మాటతో లేల్చేశారు. ..విస్తరణ ఇప్పట్లో లేనట్లే? అన్నారు. ఇంకేముందు నాకు మంత్రి పదవి, నాకు మంత్రి పదవి అనుకున్నవాళ్లంతా ఒక్కసారిగా నిట్టూరుస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండున్నరేళ్లు పూర్తవుతున్నాయి. అడపా దడపా రెండుసార్లు విస్తరణ జరిగింది. ఇక అవే ఆఖరని తెలుస్తోంది. ఇంకా రెండు మంత్రి పదవులు ఖాళీగా వున్నాయి. వాటిని నింపాలనే సిఎం. రేవంత్‌కు వుంది. కాని వాటిని భర్తీ చేయడం అనేది తేనెతుట్టెను కదిలించడమే అనే ఆలోచన వున్నట్లుంది. అందుకే ఈ ముచ్చట వచ్చిన ప్రతీసారి సిఎం. రేవంత్ రెడ్డి చల్లారుస్తూనే వున్నారు. అయినా కొంత మంది ఆశావహులు ఇంకా ఆశలు పెట్టుకుంటేనే వున్నారు. ఆఖరు ఏడాదైనా సరే మంత్రి అని పించుకోవాలని చాలా మంది అనుకుంటున్నారు. అది సాధ్యమా? కాదా? అనేది కాలమే చెప్పాలి. ఎందుకంటే కొత్తగా మంత్రులను తీసుకోవాలంటే, పాత మంత్రులలో కొంత మందిని కాదునుకోవాలి. అది సాధ్యమయ్యేపని కాదు. మంత్రి పదవుల మీద వస్తున్న వార్తలు ఊహాగానాలే. మంత్రి వర్గ విస్తరణ జరిగితే ఉద్వాసనలు కూడా వుంటాయని కొన్ని వచ్చాయి. కొంత మంది మంత్రుల శాఖల మార్పులపై కూడా రకరకాల చర్చలు వినిపించాయి. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు మంత్రి పదవి కావాలంటున్నట్లు కూడా వార్తలు వినిపించాయి. ఇక రాజగోపాల్ రెడ్డి గురించి తెలియంది కాదు. బిజేపిని వదిలి కాంగ్రెస్‌లో చేరినప్పుడే ఇచ్చిన హామీ అలాగే వుందంటుంటారు. మరి అన్నను పక్కన పెట్టి తమ్ముడికి ఇస్తారా? అనేది కూడా పెద్ద చర్చనీయాంశమైపోయింది. ఎంత పాలన సాగించినా ఇంకా ఓ ఏడాది కాలమే. ఆ తర్వాత అంతా రాజకీయమే. అప్పుడు విస్తరణ అనేది కూడా జరిగే ప్రక్రియకాదు. పొరపాటును మంత్రి వర్గ విస్తరణ అనేది వుందన్న మాట నిజమే అనుకుంటే ఎంత మంది డిల్లీకి క్యూకడతారో తెలియందికాదు. అందుకే ఎమ్మెల్యేలైన ప్రతి ఒక్కరు మంత్రి కావలనుకుంటారు? అది తప్పు కాదు. అలా అని అందరికీ అవకాశం రాదని సిఎం. రేవంత్‌రెడ్డి ఈ మధ్య చెప్పకనే చెప్పారు. అయినా ఆ వార్తలు ఆగవు. ఆయా నాయకులకు అనుబంధ మీడియా ఈ వార్తలు రాయక మానదు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాత్రం తనకు మంత్రి పదవి పక్కా అంటూ పదే పదే చెప్పుకుంటూ వచ్చారు. ఇప్పటికీ ఆయనలో ఏదో మూలన ఓ ఆశ మాత్రం వుంది. ఆఖరు ఏడాదిలోనైనా మంత్రినైతా అనే నమ్మకం ఆయనలో వుంది. ఒక దశలో నేను హెూం మంత్రినౌతా? అని కూడా చెప్పుకున్నారు. అలా పదే పదే చెప్పుకుంటూ కాలం గడుపుతున్నాయి. అయితే ఆ మధ్య తనకు మంత్రి పదవి అంత ఇంపార్టెన్స్ కాదని కూడా అన్నారు. కాని పదే పదే మంత్రి పదవి అనేది ఆయన మాటల్లో వ్యక్తమౌతూనే వుంటుంది. అడపా దడపా మంత్రి వర్గ విస్తరణపై వార్తలు రావడం ఆగడం లేదు. ప్రతి మూడు నెలలకోసారైనా ఈ వార్త చక్కర్లు కొడుతూనే వుంది. ఆ మధ్య ఒక విస్తరణ జరిగిపోయింది. అయినా మొదటి నుంచి వున్న ఆశావహులకు మాత్రం పదవి దక్కలేదు. కాని ఇతర నాయకులకు మంత్రి పదవులు దక్కాయి. అలా దక్కిన వారిలో వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామిలున్నారు. కాని ముందు నుంచి వినిపిస్తున్న పేర్లకు మాత్రం లిస్టులో చోటు దక్కలేదు. అదిష్టానం చెప్పిన వారికే ఇక మంత్రి పదవులు అంటూ కొన్ని సార్లు వార్తలు వచ్చాయి. కాని సిఎం. రేవంత్ రెడ్డి సూచనల మేరకే మంత్రి పదవులు వస్తున్నాయని తేలిపోతోంది. పైగా సిఎం. రేవంత్‌రెడ్డి కూడా మంత్రి వర్గ విస్తరణపై ఒకే మాట మీద వుంటున్నారు. విస్తరణపై ఆయన వుంటుందన్న మాటలు చెప్పలేదు. గతంలో ఓ సారి మీడియా అడిగితే కూడా పూర్తి స్థాయి మంత్రి వర్గముందన్న మాటలే మాట్లాడారు. పైగా శాఖలు ఖాళీ లేవంటూ కూడా చెప్పుకొచ్చారు. ఇవ్వాల కాకపోతే రేపు అనే ఆశల్లో చాల మంది ఎమ్మెల్యేలు ఎదురుచూస్తున్నారు. ఇలా కాలం సాగుతున్న కొద్ది కొత్త కొత్త పేర్తు కూడా తెరమీదకు వస్తున్నాయి. జూబ్లీ హిల్స్ ఎన్నికల ముందు విస్తరణ వుంటుందనగానే చాలా మంది ఆశ పడ్డారు. కాని మంత్రి అజహరుద్దీన్‌తో మాత్రమే ప్రమాణం చేయించి, మమ అనిపించారు. పెంచుకున్న ఆశలు ఆవిరైపోయాయని కొంత మంది మథన పడ్డారు. ఇదిలా వుంటే ఓ ముగ్గురు మంత్రులను తొలగిస్తారు. వారి స్థానంలో గతం నుంచి ఆశలు పెంచుకున్న వారికి చోటు కల్పిస్తారంటూ కూడా విస్తృత ప్రచారం జరిగింది. ఇలా మంత్రి వర్గ విస్తరణ గురించి వార్తలు వచ్చిన ప్రతీసారి మంత్రి పొన్నం పేరు ఎందుకు వస్తుందో అర్థం కాకుండా వుందని ఆయన అనుచరులు అంటున్నారు. నిజానికి మంత్రి పొన్నం ప్రభాకర్ పెద్దగా వివాదాస్పద నాయకుడు కాదు. పైగా కాంగ్రెస్ పార్టీలోనే పుట్టి పెరిగిన నాయకుడు. విద్యార్థి దశ నుంచి ఇప్పటి వరకు ఆయన పార్టీనే నమ్ముకొని వున్నారు. గతంలో బిఆర్ఎస్ నుంచి ఆఫర్లు వచ్చినా తిరస్కరించారు. కాంగ్రెస్‌ను వదిలివెళ్లలేదు. పైగా ఆయన తెలంగాణ ఉద్యమకారుడు. పార్లమెంటులో బిల్లు పాస్ అయిన సందర్భంలో ఆయన ప్రాణాలకు తెగించారు. ఒక దశలో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. పెప్పర్ స్ప్రే వల్ల ఆయన ప్రాణాల మీదకు వచ్చింది. అలా తెలంగాణ కోసం పనిచేసిన నాయకుడు మంత్రి పొన్నం ప్రభాకర్. కాకపోతే కొంత ఆవేశపరుడు అనే మాట వున్నా, ఎంతో లోతైన ఆలోచనా పరుడు పొన్నం ప్రభాకర్. సమస్యల మీద అవగాహన వున్న నాయకుడు. అలాంటి నాయకులు కాంగ్రెస్‌లో చాలా తక్కువ మంది వున్నారు. అయినా పదేపదే పొన్నంపేరును తెరమీదకు తెస్తున్నారు. మరో మంత్రి కొండా సురేఖ పేరు కూడా ప్రతిసారి వినిపిస్తోంది. సుధీర్ఘమైన రాజకీయ చరిత్ర కలిగిన నాయకురాలు కొండా సురేఖ. ఒకప్పుడు ఉమ్మడి వరంగల్‌ను శాసించిన నాయకుడు కొండా మురళి. అలాంటి నాయకులను పక్కన పెట్టే ప్రయత్నం చేస్తే కాంగ్రెస్ పార్టీకే తీరని నష్టం. అయినా కొండా సురేఖ ప్రజా సమస్యల మీద ఎంతో అవగాహన వున్న నాయకురాలు. ప్రజలకు ఏం కావాలో తెలిసిన నాయకురాలు. పదవుల కోసం ఆమె రాజకీయాలు చేయలేదు. నమ్మిన నాయకుడి కోసం, సిద్ధాంతాల కోసం ఆమె పదవులను కూడా తృణ ప్రాయంగా వదిలేసిన నాయకురాలు. అలాంటి నాయకురాలిని ఎలాగైనా మంత్రి వర్గం నుంచి తొలగిస్తారంటూ వచ్చే వార్తలకు అర్థం లేదు. సిఎం. రేవంత్ రెడ్డి అలాంటి ఆలోచనలు చేస్తారని అనుకోవడంలో నిజం వుండకపోవచ్చు. ఇక మరో మంత్రి జూపల్లి కృష్ణారావు. అటు ఎమ్మెల్యేగా, ఇటు మంత్రిగా సుధీర్ఘమైన రాజకీయ జీవితం ఆయన సొంతం. అంతేకాకుండా తెలంగాణ కోసం ఉమ్మడి రాష్ట్రంలో మంత్రి పదవిని వదులుకున్న నాయకుడు జూపల్లి కృష్ణారావు. రాజకీయాల్లో వివాదాలు వస్తుంటాయి, పోతుంటాయి. అవి శాశ్వతం కాదు. కాని నాయకుడి సామర్థ్యం ముఖ్యం. ప్రజల్లో జూపల్లి మీద అభిమానం లేకుంటే అన్ని సార్లు ఒక నాయకుడు విజయం సాదించలేరు. కాంగ్రెస్‌లో వున్నంత కాలం గెలుస్తూ వచ్చారు. బిఆర్ఎస్‌లో చేరినా గెలిచారు. కాకపోతే ఒక్కసారి ఓడిపోవడం వల్ల ఆయన నాయకత్వ పటిమలో పదును తగ్గిందనుకోవడంలో అర్థం లేదు. ఓ వైపు విస్తరణ అంటూ వార్తలు వచ్చే సమయంలోనే మార్పులు, చేర్పులపై వార్తలు రావడం వల్ల ఒకింత అసహనం కూడా నాయకుల్లో వ్యక్తమౌతూ వస్తోంది. పైగా జిహెచ్ఎంసి ఎన్నికల సమీపిస్తున్న తరుణంతోపాటు, పరిషత్ ఎన్నికలు కూడా ముందున్నాయి. ఇప్పుడు మంత్రి వర్గ విస్తరణ చేసినా, ఒక వేళ మార్పులు చేర్పులు చేసినా పార్టీ పరిస్థితి ఆగమ్యగోచరంగావుంది.

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి



నిష్పక్షపాత వార్తల నిలయం

# నేటిధాత్రి

తెలుగు వార్త పత్రిక



మంగళవారం 30-06-2026 పేజీలు : 8 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 83 రూ॥ 6.00



22th ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం

నిష్పక్షపాత వార్తల నిలయం

నేటిధాత్రి

22ND ANNIVERSARY

# 22వ వసంతపు తోరణం

చరిత్రను చెప్పాలన్నా , ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో "21 మైలు రాళ్లు " దాటుకొని ముందుకు సాగుతూ , తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని , తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ పత్రికా ప్రయాణం సాగిస్తూ "22 వ వసంతం" లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో

మీరు ఇప్పటివరకు అందించిన , అందిస్తున్న సహాయ , సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....



మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

22ND ANNIVERSARY

వసంతాల అక్షరోద్యమం



మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999

Corporate Office Address :

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

# గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి.



రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై జాడి శ్రీధర్....

**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** గంజాయి మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టాలని, గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని రామకృష్ణాపూర్ పట్టణ ఎస్ఐ జాడి శ్రీధర్ పిలుపునిచ్చారు. రామగుండం పోలీస్ కమిషనర్, మంచిర్యాల డీసీపీ, బెల్లంపల్లి ఏసీపీ ఆదేశాల మేరకు ఆదివారం రామకృష్ణాపూర్ పట్టణంలోని సీహెచ్‌పీ, భగత్ సింగ్ నగర్ తదితర ప్రాంతాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈగల్ బృందం, నార్కోటిక్ డాగ్ సహాయంతో పలు అనుమానస్పద గృహాల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం ఎస్ఐ జాడి శ్రీధర్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేకంగా ఈగల్ టీంను ఏర్పాటు చేసిందని, ఈ బృందం 24 గంటలూ తనిఖీలు చేస్తుందని తెలిపారు. పట్టణంలో ఎవరైనా గంజాయి సేవిస్తున్నా, విక్రయిస్తున్నా, అనుమానిత వ్యక్తులు కనిపించినా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను, యువతను కోరారు. ఈ కార్యక్రమంలో ఈగల్ బృందం సభ్యులు, రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బందిపాల్గొన్నారు.

# నర్సంపేట నుంచి జూలై 3న అరుణాచలం ప్రత్యేక యాత్ర బస్సు



ఆర్టీసీ నర్సంపేట డిపో మేనేజర్ సరస్వతి....

**నర్సంపేట, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) నర్సంపేట డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక టూర్ ప్యాకేజీలో భాగంగా జూలై 3వ తేదీన అరుణాచలం యాత్రకు సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. 36 సీట్ల సామర్థ్యం కలిగిన సూపర్ లగ్జరీ బస్సు జూలై 3వ తేదీ సాయంత్రం 4 గంటలకు నర్సంపేట డిపో నుంచి బయలుదేరి కాణిపాకం వినాయక స్వామి ఆలయం, తమిళనాడులోని వెల్లూరు గోల్డెన్ టెంపుల్, కాంచిపురం, అరుణాచలం గిరి ప్రదక్షిణతో పాటు ప్రధాన దేవాలయాల దర్శనం చేయించనుంది. తిరుగు ప్రయాణంలో విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాన్ని సందర్శించి జూలై 7వ తేదీ సాయంత్రం నర్సంపేట డిపోకు చేరుకుంటుందని తెలిపారు. యాత్రకు ఆసక్తి ఉన్న భక్తులు ముందస్తుగా సీట్లు బుక్ చేసుకోవాలని సూచించారు. వివరాలు, బుకింగ్ కోసం 9704644543, 9989038476 నంబర్లను సంప్రదించవచ్చని డిపో మేనేజర్ సరస్వతి తెలిపారు

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం.



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్: సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పిచేర్యాగడి పాత తాండలో అనారోగ్యంతో బాధపడుతూ. సోమవారం ఉదయం మృతి చెందిన దేవసోత్ శంకర్, కుటుంబానికి రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్. గిరిధర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సిద్ధం డాక్టర్. ఉజ్వల్ రెడ్డి, పారిశ్రామిక వేత్త జహీరాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ నాయకులు కె. ప్రసాద్ రెడ్డి, ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ ఒ కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్, విజ్ఞప్తి మేరకు అంతక్రియాలకు నిమిత్తం తమవంతు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు ఆర్థిక సహాయం చేసిన నాయకులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోహీర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్, వార్డు సభ్యులు చౌహాన్ అనూష బాయి – రవీందర్, రాథోడ్ సంజీవ్ కుమార్, పిచరాగడి డీసీసీబీ డైరెక్టర్ చౌహాన్ లస్కర్ నాయక్, గ్రామస్తులు రవి నాయక్, సురేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

# ప్రజలకు అందుబాటులోనే పోలీసింగ్




దామెర పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్ఐగా వీరభద్రరావు బాధ్యతలు...

**పరకాల, నేటిధాత్రి:** దామెర పోలీస్ స్టేషన్‌లో నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఈ. వీరభద్రరావు సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఈ. వీరభద్రరావు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పారదర్శకమైన పోలీసింగ్‌ను అందించడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణతో పాటు మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజలు పోలీసులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, నేరాల నివారణలో సహకరించాలని ఆయన కోరారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ పై తప్పుడు ప్రచారాలు చేస్తే పరువు నష్టం దావాకు సిద్ధం..

సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తే చట్టపరమైన చర్యలు....సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్...




**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** అంజనీపుత్ర రియల్ ఎస్టేట్‌పై జరుగుతున్న తప్పుడు ప్రచారాలపై ఆ సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థపై కొంతమంది కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని, సోషల్ మీడియా వేదికలను ఉపయోగించి సంస్థ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాలను సహించేది లేదని స్పష్టం చేశారు. సంస్థపై వస్తున్న ఫేక్ వార్తలు, నకిలీ పీడీఎఫ్‌లు, ఆధారాలు లేని ఆరోపణలను ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. అంజనీపుత్ర ఎప్పటి నుంచో పారదర్శక విధానాలతో ముందుకు సాగుతోందని, వినియోగదారుల నమ్మకమే తమకు ప్రధాన బలమని పేర్కొన్నారు. వాట్సాప్ గ్రూపులు, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చైర్మన్ గుర్రాల శ్రీధర్ హెచ్చరించారు. సంస్థపై దుష్ప్రచారం చేస్తున్న వారిని గుర్తించి న్యాయపరంగా ఎదుర్కొంటామని, అవసరమైతే కోట్ల రూపాయల పరువు నష్టం దావా వేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అడ్డంకులను అధిగమిస్తూ అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ విశ్వసనీయతతో ముందుకు సాగుతోందని, సంస్థపై ప్రజలు ఉంచిన నమ్మకానికి ఎలాంటి ఢోకా లేదని ఆయన అన్నారు. తప్పుడు ప్రచారాలతో సంస్థ అభివృద్ధిని అడ్డుకోవాలని చూసే ప్రయత్నాలు విఫలమవుతాయని స్పష్టం చేశారు.

# హజ్ యాత్ర పూర్తిచేసుకుని శంషాబాద్ ఎయిర్పోర్ట్ కు చేరుకున్న యాత్రికులు



**శంషాబాద్, నేటిధాత్రి:** శంషాబాద్ ఎయిర్పోర్ట్ నుండి బయలుదేరి వెళ్ళిన హజ్ యాత్రికులు 45 రోజుల పవిత్ర యాత్రను పూర్తి చేసుకుని స్వదేశానికి చేరుకున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అడుగు పెట్టిన యాత్రికులకు వారి కుటుంబ సభ్యులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో హజ్ యాత్రకు వెళ్లిన 50 మంది భక్తులు క్షేమంగా తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ... హజ్ యాత్రలో మొహర్రం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధ ప్రభావంతో విమానయాన సంస్థలు టికెట్ ధరలను పెంచాయని, దీంతో హజ్, ఉమ్రా యాత్రికులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ ఆధ్యాత్మిక ప్రశాంతత, దైవ సన్నిధిలో గడిపే అనుభూతి కోసం ఎంత ఖర్చైనా వెనుకాడడం లేదని ఆయన అన్నారు. యాత్రికుల ఆనందం, కుటుంబ సభ్యుల ఆత్మీయ స్వాగతంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

# సమస్యలు పరిష్కారం కోసం కలెక్టర్ ప్రతీక్ ను కోరిన ఎమ్మెల్యే



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని వివిధ సమస్యలపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసిన జహీరాబాద్ శాసనసభ్యులు శ్రీ కొనింటి మాణిక్ రావు

**రోడ్డుల మరమ్మతులు :-** నియోజవర్గంలోని పలు పంచాయత్ రాజ్ రోడ్డులను మండల కేంద్రాలకు కనెక్టివిటీ రోడ్డు ల ఏర్పాటు, మరమ్మతులు చేపట్టాలని

**వెజ్ & నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్..** గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వెజ్ ఒ నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లబ్ధిదారులకు అప్పగించాలని,

**పాఠశాల & విద్యార్థుల సమస్యలు...** దిగ్వాల్ గ్రామంలో గల "ఎం జిపి" (బాయ్స్ )పాఠశాల ను వివిధ కారణాల సరైన ప్లే గ్రౌండ్ , రోడ్ విస్తీరణ పలు కారణాల విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతుంది అని, వీలైనంత త్వరగా స్కూల్ బిల్డింగ్ ను మార్చాలని, మొగుడంపల్లి మండల ధనసిరి గ్రామంలో పాఠశాల నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని

**నీటి ఎద్దడి....** ప్రతి గ్రామం , మున్సిపల్ వార్డ్ లలో నీటి ఎద్దడి ను తగ్గించడానికి అవసరతను బట్టి బోర్ లను ఏర్పాటు చేయాలని...

**నిధుల మంజూరు...** నూతన ప్రతిపాదిక "ఎన్ఆర్ఈజీఎస్" సంబంధించిన నిధులను మంజూరు చేయాలని మిషన్ భగీరథ పనుల మరమ్మత్తుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు అని, వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు,

# అంబేద్కర్ సంఘం 50వ ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి.



**చిట్యాల, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు జన్నె యుగేందర్ అధ్యక్షతన జరిగిన సంఘం సమావేశానికి, సభ్యత్వ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంబేద్కర్ ఫెలోషిప్ నేషనల్ అవార్డు గ్రహీత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్యలి విచ్చేసి మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేద్కర్ అన్ని కులాలకు మతాలకు సంబంధించిన గొప్ప సంఘసంస్కర్త అని ఈ మహనీయుడు అందరివాడన్నారు. దేశ ప్రజల భవిష్యత్ తరాల కోసం భారత రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. దళిత బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజల చీకటి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుని ఆశయాలను కొనసాగించాలన్నారు. అంబేద్కర్ యువజన సంఘం సభ్యత్వాలను కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు రాజకీయ పార్టీల, వివిధ సంఘాల నాయకులు సభ్యత్వాలను తీసుకోవాలని కోరారు. భారత రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు రిజర్వేషన్లు ఓటు హక్కు అన్ని సౌకర్యాలు కల్పించారాని తెలిపారు. గ్రామాలలో అంబేద్కర్ యువజన సంఘాలను బలోపేతం చేస్తూ ఆ మహనీయుని ఆశయాలను కొనసాగించాలన్నారు. 1976లో స్థాపించబడిన అంబేద్కర్ యువజన సంఘం 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 50వ ఆవిర్భావ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలనులి గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఘనంగా జరపాలన్నారు. హైదరాబాదులో అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు గిన్నిస్ బుక్ రికార్డ్ డాక్టర్ జే బీ రాజు గారు చైర్మన్ నేతృత్వంలో రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అవిలయ్య గారి అధ్యక్షతన జరిగే 50వ ఆవిర్భావ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు గ్రామ మండల జిల్లాల నుండి దళిత బడుగు బలహీన వర్గాలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం యొక్క సభ్యత్వాలనులి అందించారు . సభ్యత్వ రుసుము 100 రూపాయలు . సంఘం యొక్క సభ్యత్వం అన్ని వర్గాలవారు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అంబేద్కర్ వాది కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతిదీ దొడ్డి కిష్టయ్య అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి పుల్ల ప్రతాప్ మండల సీనియర్ నాయకులు గుర్రపు రాజమౌళి గురుకుంట్ల కిరణ్ పుల్ల సమ్మయ్య గడ్డం సదానందం తదితరులు పాల్గొన్నారు

# అధిక ఫీజులు,పుస్తకాల దందాపై ఉక్కుపాదం మోపాలి

లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు సిద్ధం...




**పరకాల, నేటిధాత్రి:** ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాల పేరుతో వేల రూపాయలు దోచుకుంటున్నాయని ఆరోపిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం పరకాల అంబేద్కర్ కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ కొందరు ప్రైవేట్ పాఠశాలలు తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని ఆరోపించారు. పాఠశాల యాజమాన్యాలు నిర్దిష్ట బుక్ స్టాళ్లతో కుమ్మక్కై విద్యార్థులను అక్కడే పుస్తకాలు కొనుగోలు చేయాలని బలవంతం చేస్తున్నాయని విమర్శించారు. ఒకటో,రెండో తరగతి విద్యార్థులకే 5 వేల రూపాయల నుంచి 6 వేల రూపాయల వరకు పుస్తకాల పేరుతో వసూలు చేస్తున్నారని,ఇది విద్యను వ్యాపారంగా మార్చడమేనని మండిపడ్డారు. పాఠశాలలు,బుక్ స్టాళ్ల మధ్య జరుగుతున్న ఈ అక్రమ వ్యవహారంపై విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజుల వసూళ్లు,పుస్తకాల దందాను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్,జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ హేమంత్,మండల కార్యదర్శి ప్రేమ్,పట్టణ ఉపాధ్యక్షుడు రోషన్,నాయకులు పాల్,మహేష్,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో మహారాజుల కాలనీ బోర్డు ఏర్పాటు.



**జహీరాబాద్, నేటిధాత్రి:** సంగారెడ్డి జిల్లా, కోహిర్ మండలం, పర్సపల్లి గ్రామంలో మాదిగ విద్యావంతులు, మహిళలు, ఉద్యోగులు మరియు కుల పెద్దల సమక్షంలో సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో మన జాతి చరిత్ర, అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని భావితరాలకు తెలియజేయాలనే సంకల్పంతో గ్రామంలోని కాలనీకి "మహారాజుల కాలనీ"గా నామకరణం చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించి, నామకరణ పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించి కాలనీ బోర్డును ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎంజీఎస్ నాయకులు రాజన్ మహారాజ్, మల్లికార్జున్ మహారాజ్, భాస్కర్ మహారాజ్, ప్రవీణ్ రాజ్ మహారాజ్, సంగారెడ్డి జిల్లా ఎంజీఎస్ కన్వీనర్ మహేందర్ మహారాజ్, కోహిర్ మండల ఎంజీఎస్ కన్వీనర్ ధన్ రాజ్ మహారాజ్, ఇతర నాయకులు, గ్రామ మహారాణులు, మహారాజులు మరియు గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలందరికీ మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ మాదిగ జాగృతి సంఘం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది.

# కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన ఉదయ్ శంకర్ పటేల్ ఘనంగా సన్మానం



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్ నియోజకవర్గ ఝరాసంగం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన ఉదయ్ శంకర్ పటేల్ ను మండలనికి చెందిన మైనార్టీ సోదరులు ఘనంగా సన్మానించారు. పార్టీ బలోకపేతానికి ఆయన చేస్తున్న కృషిని, మైనార్టీ వర్గాలకు ఇస్తున్న ప్రాధాన్యతను కొనియాడుతూ పలు ప్రాంతాల్లో ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఉదయ్ శంకర్ పటేల్ కు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పరిశీలిన.

జహీరాబాద్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎంజి రాములు



**జహీరాబాద్, నేటిదాత్రి:** శేఖపూర్ గ్రామంలో 258,259,260,261, బూత్ లో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ ) కార్యక్రమాన్ని జహీరాబాద్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎంజి రాములు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఏ'ఎస్ తో కలిసి ఇంటింటికీ జరుగుతున్న ఓటరు వివరాల ధృవీకరణ ప్రక్రియను సమీక్షించారు. ప్రతి అర్హులైన ఓటరు తమ వివరాలను సరిచూసుకుని, అవసరమైన మార్పులు, చేర్పులు చేయించుకోవాలని ఆయన సూచించారు. ప్రజలందరూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును భద్రపరచుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించడంలో బిఎల్ఓల సేవలు ఎంతో కీలకమని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జాకిర్ పటేల్,అలెగ్జాండర్, నాయరణ గౌడ్ మాజీ ఎంపీటీసీ, ఆరిఫ్ భాయ్,బిఎల్ఎ కుర్షితభై బిఎల్ఎ షేక్ అలీ, దస్తగిరి, తులజారామ్, చోటుమియా, అజిమాబేగాం బిఎల్ఓ, భయసాగర్ జిపిఓ, రహీమ్, ముస్సా ,గ్రామ పెద్దల కాంగ్రెస్ పార్టీ ముఖ్యం నాయకులు పాల్గొన్నారు..

# ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు



**నడికూడ, నేటిధాత్రి:** పాడి పశువులను ముద్ద చర్మ వ్యాధి నుంచి రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత టీకాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని చర్లపల్లి గ్రామంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి పశుపాలక రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి డాక్టర్ వినయ్ మాట్లాడుతూ,లంపి స్కిన్ వ్యాధి సోకిన పశు వులకు తీవ్రమైన జ్వరం,చర్మంపై బొబ్బలు,నోటిలో పుండ్లు లాంటి వ్యాధి లక్షణాలు ఉంటాయని చెప్పారు తెలిపారు. పశువుల పనితీరు కూడా దెబ్బతిని రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుందని వివరించారు. వ్యాధి తీవ్రత పెరిగితే పశువులు మేత,నీరు తీసుకోవడం మానేసి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. రైతులు మూడు నెలల వయస్సు దాటిన దూడలకు, పెద్ద పశువులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి,లంపి స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 156 పశువులకు టీకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్ కుమార్,పంచాయతీ కార్యదర్శి,పశు వైద్య సిబ్బంది నవత లైఫ్ టాక్ అసిస్టెంట్, రవీంద్రనాథ్,వెటర్నరీ అసిస్టెంట్,లాల్ సింగ్,శంకర్ అటెండర్స్ పాటు పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 8 అర్జీల స్వీకరణ



## నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు ఆర్డీవో ఆదేశం...

**పరకాల, నేటిధాత్రి:** పరకాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ఆర్డీవో అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు,మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మొత్తం 8 అర్జీలు స్వీకరించారు. అందిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి,వాటిని నిర్ణీత గడువులోగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో అధికారులను ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు.

# తకియ హజరత్ సయ్యద్ బూర్హాన్ అలీ షా ఆవరణలో ఘనంగా మొహర్రం



**జహీరాబాద్, నేటిధాత్రి:** సంగారెడ్డి జిల్లా శాసనసభ పురపాలక సంఘం పరిదిలోని తకియ ఆవరణలో మొహర్రం నెల 5వఇ తేదీ నుంచి ఘనంగా జాతర కొనసాగుతుంది. ఇందులో బాగంగా ముఖ్యంగా మొహర్రం, నెల పదో , 11వ తేదీ రోజున జహీరాబాద్ పట్టణంలో గడి నుంచి హజ్రత్ హుస్సేని బాష, మరియు హజ్రత్ జిల్ఫేఖర్ అలీ పీర్లను ఊరేగిస్తూ హజ్రత్ సయ్యద్ బుర్హాన్ అలీషా, చాంద్ పీర్లు ఆవరణలో ముగించడం జరుగుతుంది. అ నంతరం మొహర్రం 11వ తేదీ రోజున హజరత్ సయ్యద్ బుర్హాన్ అలీషా దర్గా ఆవరణలో పెద్ద ఎత్తున జాతర కొనసాగుతుంది. అదేవిధంగా కులమతాలకు అతీతంగా భక్తులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి దర్గాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గత ఎన్నో సంవత్సరాల నుంచి సంప్రదాయాల ప్రకారంగా కొనసాగిస్తున్న దర్గా, ముతవల్లి వో సజ్జద నషీన్ సయ్యద్ ఇక్బాల్ షా బ్రదర్ ముతవల్లి సయ్యద్ జమీర్ షా ఆధ్వర్యంలో జాతర కొనసాగిస్తారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పీర్లకు మొక్కులు చెల్లించడంతోపాటు నైవేద్యయ సమర్పించి తమ కోరికలు కోరుతారు. ఈ జాతరలో ప్రజలు కులమ తాలకు అతీతంగా పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ముంతాజ్ షా, సయ్యద్ సాదిక్ అలీషా, సయ్యద్ పర్దిన్ షా, సయ్యద్ ఫహద్ షా, సయ్యద్ పారిస్ షా తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ఒక్క ఓటు మాత్రమే కలిగి ఉండాలి.



## బి.ఎల్.ఏ. 2 లతో కార్మిక శాఖ మంత్రి సమీక్ష సమావేశం...

**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** ప్రతి ఒక్కరికి ఒక ఓటు మాత్రమే కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని భీమా గార్డెన్ లో ఆయన బి.ఎల్.ఏ -2 లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్.) ను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. బిఎల్ఏ లు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. 2002 కి ముందు ఉన్న ఓటరు వివరాలు ఓటర్లకు చేరవేసే బాధ్యత తీసుకోవాలని వెల్లడించారు. 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లను గుర్తించి, ఓటరుగా నమోదు చేయాలని పేర్కొన్నారు. వలస ఓట్లను గుర్తించి వారి వివరాలు సేకరించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. కొంతమందికి రెండు లేదా అంతకన్నా ఎక్కువ ఓట్లు ఉన్నాయని చెప్పారు. అలాంటి వారి వివరాలు సేకరించి పేర్లను తొలగించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ అజీజ్, జిల్లా సెక్రటరీలు మహంకాళి శ్రీనివాస్, గోపతి భానేష్, సంధ్యారాణి, పట్టణ అధ్యక్షులు వోడ్నాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు గోపతి రాజయ్య, కౌన్సిలర్లు భీమ మల్లేష్, కూతురు ప్రభాకర్, గుర్రం శ్రీనివాస్,నాయకులు, బి ఎల్ ఎ లు పాల్గొన్నారు.

# ఘనంగా ఏరువాక పౌర్ణమి...



**జహీరాబాద్, నేటిధాత్రి:** ఏరువాక పౌర్ణమి పండుగను ఝరాసంగం, మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లోని రైతులు ఏరువాక పౌర్ణమి పండుగను అహ్లాదంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచే గ్రామాల్లోని రైతులు తమ పశువు లు, లను శోభాయమానంగా అలంకరించి ఝరాసంగం మండల బోరేగావ్ గ్రామ సర్పంచ్ నాగేందర్ పటేల్ ఆధ్వర్యంలో ఊరేగించారు. సాయంత్రం వేళ గ్రామంలో పశువుల పోటీలు, ఎద్దుల బండ్ల పోటీలు, ఏరువాక తాడు తెంపే పోటీలను నిర్వహించరు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల సమక్షంలో జరిగిన పోటీలలో రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కక్కర్వాడ, తుమ్మనపల్లి, మేధాపల్లి, ఎల్గొయి , కంబాలపల్లి, నర్సాపూర్, కుప్ప నగర్, తదితర గ్రామాల్లో రైతులు ఏరువాక పోటీలను ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు పరపతి సంఘం నూతన ట్రస్ట్ బోర్డు కార్యవర్గం ఎంపిక



## అధ్యక్షుడిగా మేడిద మధుసూదన్ -- ప్రధాన కార్యదర్శిగా బండి రమేష్...

**వరంగల్, నేటిధాత్రి:** వరంగల్ నగరంలోని కరీమాబాద్ ప్రాంతానికి చెందిన మున్నూరు కాపు పరపతి సంఘం ట్రస్ట్ బోర్డు సమావేశం గుండు బావుల సమీపంలోని మున్నూరు కాపు భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన ట్రస్ట్ బోర్డు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా మేడిద మధుసూదన్, ఉపాధ్యక్షుడిగా బండి చక్రపాణి, ప్రధాన కార్యదర్శిగా బండి రమేష్, సంయుక్త కార్యదర్శిగా వలిశెట్టి సుధాకర్, కోశాధికారిగా బోరిగం భాస్కర్ ఎన్నికయ్యారు. సమావేశానికి ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లు హాజరుకాగా, సంఘంలో సుమారు 800 మంది సభ్యులు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మేడిద మధుసూదన్, ప్రధాన కార్యదర్శి బండి రమేష్ మాట్లాడుతూ, మున్నూరు కాపు సంఘ భవన అభివృద్ధి, నిర్మాణ పనులకు ప్రాధాన్యత ఇస్తామని, అలాగే కరీమాబాద్‌లోని తోట్లవాడ ప్రాంతంలో నివసిస్తున్న మున్నూరు కాపుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లు, సంఘ సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

# జన్వాడలో విషాదం.. ఉరేసుకుని భార్యాభర్తల బలవన్మరణం

## ఆరు నెలల చిన్నారిని అనాథగా చేసి అఘాయిత్యం....దర్యాప్తు చేపట్టిన మోకిల పోలీసులు...





**శంకర్‌పల్లి, నేటిధాత్రి:** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామంలో ఆదివారం విషాద ఘటన చోటుచేసుకుంది. భార్యాభర్తలు ఒకే తాడుతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జన్వాడ గ్రామానికి చెందిన సాయి (32), పద్మ ఏడాది క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. సాయి ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా, పద్మ గృహిణిగా ఇంటి వద్దే ఉంటున్నారు. వీరికి ఆరు నెలల వయస్సు గల కుమారుడు ఉన్నాడు. ఆదివారం రోజున ఉదయం భార్యాభర్తలు ఇద్దరూ ఒకే తాడుతో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొంతసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మోకిల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దంపతులు ఆత్మహత్యకు పాల్పడడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువులను విచారించి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. కాగా, తల్లిదండ్రులను కోల్పోయిన ఆరు నెలల చిన్నారి అనాథగా మారడంతో గ్రామస్థులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటన జన్వాడ గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

# బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

## సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట సీఐటీయూఆధ్వర్యంలో ధర్నా



**సిరిసిల్ల, నేటిధాత్రి:** సిరిసిల్ల పట్టణ కేంద్రంలోని బీడీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన రూ.4,016 జీవన భృతి (ఆసరా పెన్షన్) హామీని వెంటనే అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్ పింఛన్‌ను రూ.6,000కు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట బీడీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ము. శం. రమేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో బీడీ కార్మికులకు రూ.4,016 జీవన భృతి అందిస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. ఉత్తర తెలంగాణలో ప్రతి ఇంటిలో బీడీ కార్మికులు ఉన్నారని, వారి ఓట్లతోనే రాజకీయ పార్టీలు గెలుస్తున్నాయని, ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం బీడీ కార్మికుల ఈపీఎఫ్ పింఛన్‌ను రూ.6,000కు పెంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రస్తుతం చాలామందికి వెయ్యి రూపాయల లోపే పింఛన్ వస్తోందని, కార్మిక సంఘాలు ఎన్నో ఏళ్లుగా రూ.6,000 పింఛన్ కోసం పోరాటం చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. బీడీ కార్మికుల నిధులు వేల కోట్ల రూపాయలు ప్రభుత్వాల వద్ద ఉన్నప్పటికీ వారికి న్యాయం చేయడం లేదని ఆరోపించారు. బీడీ కార్మికుల ఓట్లతో గెలిచిన కేంద్ర మంత్రి బండి సంజయ్ పార్లమెంట్‌లో బీడీ కార్మికుల పింఛన్ అంశాన్ని ప్రస్తావించాలని, ప్రతిపక్ష నాయకుడు కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.4,016 జీవన భృతి హామీ అమలుపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలను పక్కనపెట్టి పరస్పర విమర్శలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. బీడీ కార్మికులకు రూ.4,016 జీవన భృతి, రూ.6,000 ఈపీఎఫ్ పింఛన్ అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురం పద్మ, ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, జవ్వాజి విమల, అన్నదాత గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు గోవిందు లక్ష్మణ్, జిందం కమలాకర్, దాసరి రూప, గుంటి అనిల్, బెజిగం సురేష్, ఆడెపు రజిత, పిల్లి జాను, సుజాత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రెగ్నెన్సీని వాయిదా వేస్తున్నారా.. ఫెర్టిలిటీపై ముందుగానే అవగాహన అవసరం

## 30 ఏళ్లలోపే ఫెర్టిలిటీ హెల్త్ చెకప్ చేయించుకోవాలి: గైనకాలజిస్ట్ డాక్టర్ చైతన్య రెడ్డి....



**శంకర్‌పల్లి, నేటిధాత్రి:** నేటి ఆధునిక జీవనశైలిలో ఉద్యోగాలు, ఉన్నత విద్య, కెరీర్ లక్ష్యాలు, ఆర్థిక పరిస్థితులు, వ్యక్తిగత ప్రణాళికలు వంటి కారణాలతో అనేక మంది దంపతులు సంతానం విషయంలో ఆలస్యం చేస్తున్నారని శంకర్‌పల్లి మెగా హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ చైతన్య రెడ్డి తెలిపారు. అయితే ఇలాంటి నిర్ణయాలు తీసుకునే ముందు ఫెర్టిలిటీపై పూర్తి అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల్లో వయస్సు పెరిగే కొద్దీ అండాల (ఎగ్స్) సంఖ్యతో పాటు వాటి నాణ్యత కూడా తగ్గుతూ ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా 30 సంవత్సరాల వయస్సు దాటిన తర్వాత ఈ మార్పులు వేగంగా కనిపిస్తాయని, దీంతో సహజ గర్భధారణ అవకాశాలు తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే గర్భస్రావం, గర్భధారణ సమయంలో వచ్చే సమస్యలు, శిశువుకు సంబంధించిన కొన్ని ఆరోగ్యపరమైన ప్రమాదాలు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. వివాహం తర్వాత వెంటనే సంతానం కోసం ప్రయత్నించకపోయినా, భవిష్యత్తులో కుటుంబ విస్తరణపై ప్రణాళికలు ఉన్న దంపతులు ముందుగానే ఫెర్టిలిటీ హెల్త్ చెకప్ చేయించుకోవడం మంచిదన్నారు. అవసరమైన వైద్య పరీక్షలు, జీవనశైలిలో మార్పులు, సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం వంటి అంశాలు ఫెర్టిలిటీని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఫెర్టిలిటీ, గర్భధారణ, మహిళల ఆరోగ్య సమస్యలకు సంబంధించిన వైద్య సలహాలు మరియు చికిత్స కోసం శంకర్‌పల్లి మెగా హాస్పిటల్‌ను సంప్రదించవచ్చని, అపాయింట్‌మెంట్ కోసం 9000066335 నంబర్‌కు కాల్ చేయాలని డాక్టర్ చైతన్య రెడ్డి కోరారు.

# అల్గోల్‌లో "ఎస్ ఎస్ వి" రెడీమిక్స్‌ప్లాంట్ పై కాలుష్య ఆరోపణలు.. చర్యలు ఎప్పుడు..?



**జహీరాబాద్, నేటిధాత్రి:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అల్గోల్ గ్రామంలోని" ఎస్ ఎస్ వి" రెడీమిక్స్ సంస్థపై స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కాలుష్య నియంత్రణ నిబంధనలను ఉల్లంఘిస్తూ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోందని, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ( టి ఎస్ పి సి బి ) పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ సంస్థ నుంచి సరైన స్పందన లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారిక రికార్డుల ప్రకారం ఈ యూనిట్‌కు గతంలో కాలుష్య నియంత్రణ అనుమతులు (కాన్సెంట్ ఆర్డర్స్ ) జారీ అయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం, ప్లాంట్ నుంచి వెలువడుతున్న దుమ్ము, సిమెంట్ కణాలు, ఇతర కాలుష్యాల కారణంగా పరిసర ప్రాంత ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీర్ఘకాలంలో క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందనే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి శాస్త్రీయ లేదా వైద్యపరమైన నిర్ధారణ ప్రజలకు అందుబాటులో లేదు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించడం లేదని, కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో సంస్థ యథేచ్ఛగా కార్యకలాపాలు కొనసాగిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు, సంస్థ యాజమాన్యం స్పందించి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మరోసారి సమగ్ర తనిఖీ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# సహకార వారోత్సవాల సందర్భంగా సహకార జెండా ఆవిష్కరణ

## సహకార స్ఫూర్తితో గ్రామీణాభివృద్ధికి కృషి చేయాలి....PACSచైర్మన్ బండి దేవదాస్ గౌడ్



**సిరిసిల్ల, నేటిధాత్రి:** సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని,కేంద్ర ప్రభుత్వంలో సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సహకార వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సిరిసిల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (గాజు) కార్యాలయంలో సహకార జెండాను సంఘం చైర్మన్ బండి దేవదాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహకార సంఘాలు రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ప్రజల ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకార రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం ద్వారా ఈ రంగం మరింత బలోపేతం అవుతోందని పేర్కొన్నారు. సహకార భావనతో పని చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, రైతులకు మెరుగైన సేవలు అందించడం సహకార సంఘాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. సహకార వారోత్సవాల సందర్భంగా నిర్వహించే వివిధ కార్యక్రమాల ద్వారా సహకార స్ఫూర్తిని ప్రజల్లో విస్తృతంగా చాటాలని, రైతులు సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణారెడ్డి, పాలకవర్గ సభ్యుడు గడీల సురేష్, సెక్రటరీ రేగుల బాబు, కార్యాలయ సిబ్బంది, సంఘానికి చెందిన సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సహకార రంగం అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తాం: మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు



**వరంగల్, నేటిధాత్రి:** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందజేస్తామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ప్రకటించారు. సోమవారం హనుమకొండలోని తన నివాసంలో వరంగల్ తూర్పు జర్నలిస్టు ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అర్హులైన జర్నలిస్టులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కొండా మురళీధర్ రావు, ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులు (అక్రిడిటేషన్) కలిగి ఉండటంతో పాటు సీనియార్టీ ప్రాతిపదికన అర్హులైన వారందరికీ ఇళ్లను అందజేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా జర్నలిస్టులు పారదర్శకంగా పనిచేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో జర్నలిస్టుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ, ఆ స్థాయిలో వార్తా కథనాలు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. ఇకపై ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పించేలా కృషి చేయాలని కోరారు. త్వరలోనే అర్హులైన జర్నలిస్టులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అప్పగించే ప్రక్రియ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుకొప్పుల నరేందర్, జక్కు విజయ్, కందుల శ్రీధర్, జన్ను స్వామి, విజయన్, హరీష్, బాలాజీ నాయక్ తదితర జర్నలిస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.




# బూత్ సమ్మేళనానికిపోటెత్తిన పరకాల బీజేపీ శ్రేణులు



**పరకాల, నేటిధాత్రి:** హనుమకొండలోని సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్స్‌లో సోమవారం నిర్వహించిన బీజేపీ బూత్ సమ్మేళనానికి పరకాల పట్టణ బీజేపీ నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ కాన్వాయ్‌తో హనుమకొండకు బయలుదేరాయి. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించిన గాజుల నిరంజన్ మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచే పార్టీని మరింత బలోపేతం చేయడమే ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. జాతీయ నాయకత్వం చేపడుతున్న కార్యక్రమాలు పార్టీ శ్రేణులకు నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొనే కార్యకర్తలు క్రమశిక్షణతో వ్యవహరించి సమ్మేళనం



విజయవంతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి బీజేపీ పరకాల మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుక్కల విజయ్ కుమార్, ఆకుల లావణ్య శ్రీధర్,పిఏసిఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి,పట్టణ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి తిరుపతి,నాయకులు మార్త బిక్షపతి,మార్త రాజభద్రయ్య,మిడిదొడ్డి నరేష్,మెంతుల స్వప్న సురేష్,ముత్యాల కోమల దేవేందర్,పిట్ట కిషోర్,పావుశెట్టి సునీత,కిరణ్,కానుగుల గోపీనాథ్,వీర్ల సమ్మయ్య,బీరం రాజిరెడ్డి,దాసరి వెంకటేశ్వర్లు,ఉడుత చిరంజీవి,సంఘ నరేష్, బొచ్చునరేందర్,నదా మధుకర్,సారంగ నరేష్,చిదిరిక అశోక్,తాడిశెట్టి రజినీకాంత్,ఆకుల రాజేందర్,ఆకుల రాంబాబు,ఒంటేరు వీరేష్,కక్కు రాజు,గునీగంటి రఘుపతి,తడక పూర్ణచందర్,బూర వెంకటేశ్వర్లు,సుదర్శన్‌తో పాటు పరకాల పట్టణంలోని వివిధ వార్డుల నుంచి అధిక సంఖ్యలో నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాఫీతో గుండెకు రక్ష



మారిన జీవనశైలిలో గుండె జబ్బుల ముప్పు నానాటికీ పెరుగుతున్నది. అయితే, మనం రోజూ తాగే కాఫీ గుండెను పదిలంగా ఉంచుతుందని సరికొత్త పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. రోజుకు రెండు నుంచి మూడు కప్పుల కాఫీ తాగడం వల్ల గుండె జబ్బుల ముప్పు గణనీయంగా తగ్గుతుందని శాస్త్రవేత్తలు నిరూపించారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ బేకర్ హార్ట్ అండ్ డయాబెటిస్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు ఈ ప్రతిష్ఠాత్మక పరిశోధనను నిర్వహించారు. బ్రిటన్‌కు చెందిన 'యూకే బయోబ్యాంక్' నుంచి సేకరించిన దాదాపు నాలుగున్నర లక్షల మంది డేటాను విశ్లేషించి ఈ అంచనాకు వచ్చారు. దాదాపు పన్నెండున్నర సంవత్సరాల పాటు వీరి ఆరోగ్య అలవాట్లను, కాఫీ వినియోగాన్ని పరిశోధకులు నిశితంగా గమనించారు. ఈ సుదీర్ఘ అధ్యయనంలో ఆశ్చర్యకరమైన నిజాలు వెలుగుచూశాయి.

రోజుకు 2-3 కప్పుల కాఫీ తాగే వారిలో గుండె జబ్బులు వచ్చే ప్రమాదం, కాఫీ తాగని వారి కంటే 20% తక్కువగా ఉన్నట్లు తేలింది. గ్రౌండ్ కాఫీ, ఇన్‌స్టంట్ కాఫీ లేదా డీకాఫిన్ అంటే కెఫిన్ తీసేసిన కాఫీ... రకం ఏదైనా సరే, కాఫీ క్రమం తప్పకుండా తాగే వారిలో అకాల మరణాల రేటు చాలా తక్కువగా ఉంది. ఇక, కాఫీలో కేవలం కెఫిన్ మాత్రమే కాదు, శరీరంలో వాపులను తగ్గించే, జీవక్రియలను మెరుగుపరిచే 100కు పైగా జీవసంబంధిత సమ్మేళనాలు ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. అయితే... చక్కెర, పాలు అతిగా లేకుండా బ్లాక్ కాఫీ లేదా తక్కువ మోతాదు పాలతో తీసుకుంటే ఈ ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. నిజజీవితంలో ఎంతో ఉపయోగపడే ఈ పరిశోధన, కాఫీ ప్రియులకు ఒక తీపి కబురనే చెప్పాలి!

# ఆరోగ్యమే మహాభాగ్యం..

## ఆరోగ్యంగా ఉండాలంటే ఈ 10 అలవాట్లు తప్పనిసరి



నేటి వేగవంతమైన జీవనశైలిలో మహిళలు ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ సంరక్షణ, గృహ నిర్వహణ వంటి అనేక పనులను ఒకేసారి నిర్వహిస్తుంటారు. ఈ నిరంతర మానసిక ఒత్తిడి, బాధ్యతల కారణంగా మహిళల శరీరం, ముఖ్యంగా మెదడు, పురుషులతో పోలిస్తే ఎక్కువ విశ్రాంతిని కోరుకుంటుందని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. అందుకే మహిళలకు సాధారణంగా పురుషుల కంటే కొంత ఎక్కువ నిద్ర అవసరమవుతుందని నిపుణులు చెబుతున్నారు. నిపుణుల ప్రకారం పెద్దలకు రోజుకు సగటున 7 నుంచి 9 గంటల నిద్ర అవసరం. అయితే మహిళలు రోజంతా అనేక బాధ్యతలను సమన్వయం చేయాల్సి రావడంతో వారి మెదడు ఎక్కువగా పనిచేస్తుంది. ఈ కారణంగా మెదడు పూర్తిగా కోలుకోవడానికి అదనంగా 20 నుంచి 60 నిమిషాల నిద్ర అవసరమయ్యే అవకాశం ఉందని అధ్యయనాలు వెల్లడించాయి.

### మానసిక శ్రమ ఎక్కువ..

పరిశోధనల ప్రకారం రోజంతా ఎక్కువ మానసిక శ్రమ చేసినప్పుడు మెదడుకు రాత్రి సమయంలో మరింత విశ్రాంతి అవసరం అవుతుంది. మహిళలు సాధారణంగా ఒకేసారి అనేక పనులను నిర్వహించడం వల్ల మెదడులోని వివిధ భాగాలు ఎక్కువగా చురుకుగా పనిచేస్తాయి. గాఢ నిద్ర సమయంలో ఈ భాగాలు మరమ్మత్తులు చేసుకుని తదుపరి రోజుకు సిద్ధమవుతాయి. నిద్ర సమయం తగ్గితే ఈ ప్రక్రియకు అంతరాయం కలుగుతుంది. మహిళల నిద్రపై హార్మోన్ల ప్రభావం కూడా గణనీయంగా ఉంటుంది. రుతుచక్ర సమయంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ స్థాయిల్లో మార్పులు రావడం వల్ల నిద్రకు ఆటంకం కలుగుతుంది. గర్భధారణ సమయంలో శారీరక అసౌకర్యం, గుండె స్పందన పెరగడం, శిశువు కదలికలు వంటి కారణాలతో నిద్ర మధ్యలో పలుమార్లు మెళకువ వస్తుంది. అలాగే మెనోపాజ్ దశలో హార్మోన్ల తగ్గుదల వల్ల రాత్రిపూట చెమటలు, నిద్రలేమి వంటి సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది.

### సరిపడా నిద్ర పొందితేనే..

సరిపడా నిద్ర పొందినప్పుడు మహిళల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. భావోద్వేగ నియంత్రణ సులభమవుతుంది. అలాగే ఆకలి, తృప్తిని నియంత్రించే హార్మోన్లు సమతుల్యంగా పనిచేయడంతో బరువు నియంత్రణకు కూడా సహాయపడుతుంది. శరీరం శక్తిని సమర్థవంతంగా వినియోగించుకునే సామర్థ్యం పెరుగుతుంది. అవసరమైన నిద్రను తరచూ తగ్గించుకోవడం వల్ల మొదట అలసట, చిరాకు, ఏకాగ్రత లోపం, నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు వంటి సమస్యలు కనిపిస్తాయి. దీర్ఘకాలంలో ఆందోళన, డిప్రెషన్, బరువు పెరగడం, ఇన్సులిన్ నిరోధకత, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరుగుతుందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి.

### నిద్రలేమి సంకేతాలు ఇవే..

తీవ్రమైన నిద్రలేమికి కొన్ని హెచ్చరిక సంకేతాలు కూడా ఉంటాయి. మధ్యాహ్నం సమయంలో అధిక అలసట, తీపి లేదా అధిక కేలరీల ఆహారాలపై తీవ్రమైన కోరిక, చిన్న విషయాలకే చిరాకు, మంచంపై చాలాసేపు గడిపినా ఉదయం తాజాగా అనిపించకపోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని నిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా పెద్దలకు 7 నుంచి 9 గంటల నిద్ర అవసరమైనప్పటికీ, చాలా మంది మహిళలకు 8 నుంచి 8.5 గంటల నాణ్యమైన నిద్ర లభిస్తే శరీరం, మెదడు పూర్తిగా పునరుద్ధరించుకునే అవకాశం ఉంటుంది. అందుకే నిద్రను విలాసంగా కాకుండా ఆరోగ్యానికి అత్యవసరమైన అవసరంగా భావించాలని నిపుణులు సూచిస్తున్నారు. నిద్ర నాణ్యతను మెరుగుపరచాలంటే ప్రతిరోజూ ఒకే సమయంలో నిద్రపోవడం, ఒకే సమయంలో లేవడం అలవాటు చేసుకోవాలి. నిద్రకు గంట ముందు మొబైల్, టాబ్లెట్ వంటి పరికరాల వినియోగాన్ని తగ్గించాలి. సాయంత్రం తర్వాత కెఫీన్, మద్యం, భారమైన ఆహారాన్ని పరిమితం చేయడం మంచిది. అలాగే పడకగది ఉష్ణోగ్రతను చల్లగా ఉంచడం ద్వారా గాఢ నిద్రకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

# వేసవిలో మునగాకుతో కలిగే అద్భుత ప్రయోజనాలు.. తెలిస్తే అస్సలు వదలరు

ఇంటర్నెట్ డెస్క్: సాధారణంగా మునగ కాయలను మనం ఎంతో ఇష్టంగా తింటాం. కానీ, మునగాకులోని ఆరోగ్య రహస్యాలను చాలా మంది పట్టించుకోరు. మునగాకు వేసవి కాలంలో శరీరానికి ఒక వరప్రసాదం లాంటిది. ఎండల వేడిని తట్టుకోవడమే కాకుండా, శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది. మునగ ఆకు వల్ల కలిగే ముఖ్యమైన ప్రయోజనాలు ఎంటో తెలుసుకుందాం.

**1. శరీరానికి చలవ:**

మునగాకులో సహజసిద్ధమైన చలవ చేసే గుణాలు మెండుగా ఉన్నాయి. వేసవిలో శరీర ఉష్ణోగ్రత పెరగకుండా నియంత్రించడంలో ఇది సహాయపడుతుంది. దీనివల్ల వడదెబ్బ తగిలే ప్రమాదం తగ్గుతుంది.

**2. శక్తినిచ్చే పవర్‌హౌస్:**

వేసవిలో అధిక చెమట వల్ల మనం త్వరగా అలసిపోతాం. మునగాకులో ఉండే ఐరన్, క్యాల్షియం, విటమిన్లు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. నీరసాన్ని తగ్గించి రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తాయి.

**3. రోగనిరోధక శక్తి పెంపు:**

వేసవిలో ఆహారం త్వరగా పాడవడం వల్ల ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుంది. మునగాకులో ఉండే విటమిన్-సి రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేసి, ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని కాపాడుతుంది.

**4. జీర్ణక్రియ మెరుగుపడుతుంది:**

మునగ ఆకులో పీచు పదార్థం పుష్కలంగా ఉంటుంది. ఇది వేసవిలో వచ్చే మలబద్ధకం, అజీర్తి వంటి సమస్యలను దూరం చేస్తుంది. పొట్టను శుభ్రంగా ఉంచుతుంది.

**5. చర్మ సౌందర్య:**

ఎండ వల్ల చర్మం కమిలిపోవడం సహజం. మునగాకులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను రక్షించి, చర్మం ప్రకాశవంతంగా ఉండేలా చేస్తాయి.

**6. మునగాకుతో విటమిన్ సి:**

విటమిన్ సి అధికంగా ఉన్న పదార్థాలు అంటే నిమ్మకాయ, ఉసిరికాయ, నారింజ వంటి పండ్లతో మునగాకు కలిపి తీసుకుంటే చాలా మంచిది. మునగాకు పొడి చేసుకొని అందులో కాసింత నిమ్మరసం కలుపుకొని తీసుకుంటే రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం.

**7. మిరియాలతో మునగాకు:**

మిరియాలలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. మునగాకుతో మిరియాలు కలిపి తీసుకుంటే న్యూట్రియెంట్స్ రెట్టింపవుతాయి. పొడిగా చేసుకొనేటప్పుడు అందులో కొన్ని మిరియాలు కలుపుకుంటే బాగుంటుంది.

**మునగ ఆకును ఎలా తీసుకోవాలి?**

వారానికి రెండు సార్లు పప్పులో కానీ, ఇతర కూరల్లో మునగాకు వేసుకొని తింటే మంచిది.

ఎండబెట్టిన ఆకును పొడి చేసి మజ్జిగలో కలుపుకుని తాగితే వేసవి వేడి నుంచి ఉపశమనం లభిస్తుంది.

పరగడుపున మునగ ఆకుల డికాషన్ తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది



గమనిక: ఇందులోని సమాచారం ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ వనరుల ఆధారంగా పాఠకులకు అందించడం జరుగుతోంది. ఈ సమాచారాన్ని నేటిధాత్రి స్వతంత్రంగా ధ్రువీకరించలేదు.

# వెల్లుల్లితో ఎన్ని లాభాలో..

# విరిగిన ఎముకలతో సహా..

ఏ మహామూలిక గుండెజబ్బులకు గొప్ప ఔషధమో, కుష్ఠు సహా అన్ని చర్మవ్యాధులకు నివారకమో, పక్షవాతం మొదలుకొని నరాల వ్యాధులన్నింటికీ ఉపశమనమో... విరిగిన ఎముకలతో సహా సమస్త ఎముక వ్యాధులను ఎదుర్కొనే శక్తిని కలిగిస్తుందో, సంతానాన్నిస్తుందో లైంగిక సమర్థతని పెంచుతుందో ఆ మహౌషధి... వెల్లుల్లికి దణ్ణాలు.

**ఇమ్యూనిటీ బూస్టర్ వెల్లుల్లి**

కాశ్యపసంహిత వైద్యగ్రంథంలో 'లశునకల్పం' అనే అధ్యాయమే ఉంది. వెల్లుల్లి ఆయుష్షును పెంచుతుంది, ఊపిరితిత్తుల్లో పేరిన కఫాన్ని కరిగిస్తుంది. జీర్ణశక్తిని, బలాన్ని, లైంగిక శక్తిని పెంపొందిస్తుంది. ఈ కారణాల వల్లే ఆయుర్వేదం వెల్లుల్లిని అమృతంతో సమా నం అన్నది!

జీవశక్తినిచ్చే రెజువెనేటర్ వెల్లుల్లి.

వెల్లుల్లి నోటిదుర్వాసనను తగ్గించి రక్తాన్ని శుద్ధి చేస్తుంది.



కొవ్వును నియంత్రిస్తుంది. దంతాలు, కండరాలు, గోళ్లు, వెంట్రుకలు బల పడేలా చేసి శరీర వర్ణాన్ని మెరుగుపరుస్తుంది. రక్తప్రసరణను, నాడీవ్యవస్థను ఉత్తేజితం చేస్తుంది. అలాగే స్త్రీ-పురుషులలో సంతాన వ్యవస్థను బలపరచి సంతానప్రాప్తికి సహాయ పడుతుంది. మేధస్సు పెరుగుతుంది. కంఠస్వరం మెరుగవుతుంది.

పాలలో ఉడికించిన వెల్లుల్లి తాగితే ఆస్తమా తగ్గుతుంది. క్షయ, న్యుమోనియాలో కఫాన్ని కరిగించి శ్వాస సులభం చేస్తుంది. వెల్లుల్లి రసాన్ని వేడి నీటితో తీసుకుంటే ఉబ్బసం, దగ్గు, ఆయాసం తగ్గుతాయి.

**ఔషధంలా తినాలి!**

వెల్లుల్లిని ఔషధంగా తీసుకున్నప్పుడే దాని ప్రయోజనాలు దక్కుతాయి. రోజుకు రెండు రెబ్బలు ఎక్కువలో ఎక్కువ మోతాదుఅంతకు మించకుండా ఉంటేనే ఆరోగ్యానికి మంచిది. మితిమీరితే ప్రయోజనానికి బదులు హాని కలుగుతుంది. బీ-కాంప్లెక్స్ మాత్ర రోజుకొక్కటి వేసుకుంటే బలం. అంతకన్నా ఎక్కువ మింగితే ఎలా ప్రమాదకరమో, అలాగే వెల్లుల్లి అతిగా తింటే గుండె, చర్మం, నరాలు, సంతాన యోగ్యత, లైంగిక సామర్థ్యానికి హాని కలిగించవచ్చు.

ఒక మనిషికి రోజుకు 1-2 రెబ్బల వెల్లుల్లి ఎక్కువలో ఎక్కువ మోతాదు. అంతకన్నా ఎక్కువగా తినవద్దనే సూచన! వంటకాల్లో వెల్లుల్లి తిననివారు భోంచేశాక 1-2 రెబ్బలు పొట్టు వలిచి, నమలకుండా మింగేయవచ్చు!

**అమృతమే కానీ...**

దేవతల అమృతం భూమిపై చింది వెల్లుల్లి మొలిచిందని ఐతిహ్యం. అది అశుభ్రమైన చోట పడటాన దానికి దుర్వాసన ఏర్పడిందని కథ. సుగంధ ద్రవ్యాలలో వెల్లుల్లి ఉగ్రగంధి. మాంసంలోని దుర్వాసన తొలగించేందుకు ఉపయోగపడ్తుంది. కూరగాయలకు అలాంటి వాసనలేవీ ఉండవు కాబట్టి, శాకాహారంలో దీనికి అంత అవసరం లేదని భావించి శ్రోత్రియులు, శుద్ధ శాకాహారులు సాధారణంగా వెల్లుల్లి వాడరు. "వెల్లుల్లిం దిలపిష్టమున్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపగా" అంటూ వెల్లుల్లి వేసి వండిన తెలికిపిండిని విధవరాలు వడ్డిస్తుంటే తినాల్సి వచ్చిన దౌర్భాగ్యానికి బాధపడ్డాడు శ్రీనాథుడు.

నేటి కాలంలో విచిత్రంగా వెల్లుల్లి వాడకం మితిమీరింది. ఆఖరికి ఇడ్లీచట్నీలో కూడా వెల్లుల్లి కలిపేస్తున్నారు. రేపు ఇడ్లీలో వెల్లుల్లి కలిపినా ఆశ్చర్యం లేదు. అవధులు దాటిన వేలంవెర్రి ప్రమాదకరం. వెల్లుల్లి అతిగా తిన్న వ్యక్తుల శరీరం నుంచి వెలువడే గవులుకంపు ఇతరులకు చాలా ఇబ్బంది కలిగిస్తుంది. పౌర సంబంధమైన వృత్తుల్లో ఉన్నవారి కెరీర్‌ని కూడా అది దెబ్బతీస్తుంది.

వెల్లుల్లి మొదట ఔషధ ద్రవ్యమే! వంటిల్లు వెల్లుల్లికి సొంతిల్లు కాదు! 4,500 సంవత్సరాల క్రితం ఈజిప్టు పిరమిడ్ల నిర్మాణ కాలంలో కార్మికులంతా బలం, ఆరోగ్యం కోసం వెల్లుల్లి తప్పనిసరిగా తినాలని ఒక రాజాజ్ఞ ఉండేదట! అలా వంట గదిలోకి ప్రవేశించింది వెల్లుల్లి. ఆహార పదార్థాల్లో అత్యవసరం అయితేనే వెల్లుల్లిని చేర్చండి. కమ్మగా ఉండే వంటకాల సహజ పరిమళాన్ని వెల్లుల్లి కమ్మేస్తుంది. ఏ కూరతిన్నా వెల్లుల్లి రుచే! అందువలన కూర గాయల సహజ పరిమళాన్ని, రుచిని ఆస్వాదిం చలేకపోతున్నాం! అతి సర్వత్రా వర్జయేత్ కదా!

- డా. జి వి పూర్ణచందు, 9440172642

# పురుషుల కన్నా మహిళలకు నిద్ర కాస్త ఎక్కువ అవసరం.. ఎందుకంటే..?

నేటి వేగవంతమైన జీవనశైలిలో మహిళలు ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ సంరక్షణ, గృహ నిర్వహణ వంటి అనేక పనులను ఒకేసారి నిర్వహిస్తుంటారు. ఈ నిరంతర మానసిక ఒత్తిడి, బాధ్యతల కారణంగా మహిళల శరీరం, ముఖ్యంగా మెదడు, పురుషులతో పోలిస్తే ఎక్కువ విశ్రాంతిని కోరుకుంటుందని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. అందుకే మహిళలకు సాధారణంగా పురుషుల కంటే కొంత ఎక్కువ నిద్ర అవసరమవుతుందని నిపుణులు చెబుతున్నారు. నిపుణుల ప్రకారం పెద్దలకు రోజుకు సగటున 7 నుంచి 9 గంటల నిద్ర అవసరం. అయితే మహిళలు రోజంతా అనేక బాధ్యతలను సమన్వయం చేయాల్సి రావడంతో వారి మెదడు ఎక్కువగా పనిచేస్తుంది. ఈ కారణంగా మెదడు పూర్తిగా కోలుకోవడానికి అదనంగా 20 నుంచి 60 నిమిషాల నిద్ర అవసరమయ్యే అవకాశం ఉందని అధ్యయనాలు వెల్లడించాయి.

### మానసిక శ్రమ ఎక్కువ..

పరిశోధనల ప్రకారం రోజంతా ఎక్కువ మానసిక శ్రమ చేసినప్పుడు మెదడుకు రాత్రి సమయంలో మరింత విశ్రాంతి అవసరం అవుతుంది. మహిళలు సాధారణంగా ఒకేసారి అనేక పనులను నిర్వహించడం వల్ల మెదడులోని వివిధ భాగాలు ఎక్కువగా చురుకుగా పనిచేస్తాయి. గాఢ నిద్ర సమయంలో ఈ భాగాలు మరమ్మత్తులు చేసుకుని తదుపరి రోజుకు సిద్ధమవుతాయి. నిద్ర సమయం తగ్గితే



ఈ ప్రక్రియకు అంతరాయం కలుగుతుంది. మహిళల నిద్రపై హార్మోన్ల ప్రభావం కూడా గణనీయంగా ఉంటుంది. రుతుచక్ర సమయంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ స్థాయిల్లో మార్పులు రావడం వల్ల నిద్రకు ఆటంకం కలుగుతుంది. గర్భధారణ సమయంలో శారీరక అసౌకర్యం, గుండె స్పందన పెరగడం, శిశువు కదలికలు వంటి కారణాలతో నిద్ర మధ్యలో పలుమార్లు మెళకువ వస్తుంది. అలాగే మెనోపాజ్ దశలో హార్మోన్ల తగ్గుదల వల్ల రాత్రిపూట చెమటలు, నిద్రలేమి వంటి సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది.

### సరిపడా నిద్ర పొందితేనే..

సరిపడా నిద్ర పొందినప్పుడు మహిళల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. భావోద్వేగ నియంత్రణ సులభమవుతుంది. అలాగే ఆకలి, తృప్తిని నియంత్రించే హార్మోన్లు సమతుల్యంగా పనిచేయడంతో బరువు నియంత్రణకు కూడా సహాయపడుతుంది. శరీరం శక్తిని సమర్థవంతంగా వినియోగించుకునే సామర్థ్యం పెరుగుతుంది. అవసరమైన నిద్రను తరచూ తగ్గించుకోవడం వల్ల మొదట అలసట, చిరాకు, ఏకాగ్రత లోపం, నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు వంటి సమస్యలు కనిపిస్తాయి. దీర్ఘకాలంలో ఆందోళన, డిప్రెషన్, బరువు పెరగడం, ఇన్సులిన్ నిరోధకత, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరుగుతుందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి.

### నిద్రలేమి సంకేతాలు ఇవే..

తీవ్రమైన నిద్రలేమికి కొన్ని హెచ్చరిక సంకేతాలు కూడా ఉంటాయి. మధ్యాహ్నం సమయంలో అధిక అలసట, తీపి లేదా అధిక కేలరీల ఆహారాలపై తీవ్రమైన కోరిక, చిన్న విషయాలకే చిరాకు, మంచంపై చాలాసేపు గడిపినా ఉదయం తాజాగా అనిపించకపోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని నిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా పెద్దలకు 7 నుంచి 9 గంటల నిద్ర అవసరమైనప్పటికీ, చాలా మంది మహిళలకు 8 నుంచి 8.5 గంటల నాణ్యమైన నిద్ర లభిస్తే శరీరం, మెదడు పూర్తిగా పునరుద్ధరించుకునే అవకాశం ఉంటుంది. అందుకే నిద్రను విలాసంగా కాకుండా ఆరోగ్యానికి అత్యవసరమైన అవసరంగా భావించాలని నిపుణులు సూచిస్తున్నారు. నిద్ర నాణ్యతను మెరుగుపరచాలంటే ప్రతిరోజూ ఒకే సమయంలో నిద్రపోవడం, ఒకే సమయంలో లేవడం అలవాటు చేసుకోవాలి. నిద్రకు గంట ముందు మొబైల్, టాబ్లెట్ వంటి పరికరాల వినియోగాన్ని తగ్గించాలి. సాయంత్రం తర్వాత కెఫీన్, మద్యం, భారమైన ఆహారాన్ని పరిమితం చేయడం మంచిది. అలాగే పడకగది ఉష్ణోగ్రతను చల్లగా ఉంచడం ద్వారా గాఢ నిద్రకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

